వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి : మంత్రి సీదిరి

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, వైసీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డు చిన్నబ్రాహ్మణ వీధి, పూజారివీధి, పెద్దబ్రాహ్మణ వీధిల్లో నిర్వహించిన గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కారించారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రభుత్వ సేవలు, ప్రజాసంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ త్వరలో కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవరు బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్‌చైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్‌బాబు, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, విప్ శంకర్ పండా, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్‌కుమార్, దబ్బీరు భవానీశంకర్, గౌరీ త్యాడి, పలాస మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్, తహాశీల్దార్ మధుసూధనరావులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి... గరిష్ట వేతనం పొందండి

డ్వామా పీడీ జీవి చిట్టి రాజు

విశాలాంధ్ర-లావేరు : పని ప్రదేశాలలో సమయపాలన పాటించడం ద్వారా గరిష్ట వేతనం పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టి రాజు ఉపాధి హామీ కూలీలను కోరారు. మంగళవారం పెదరావుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు మరియు ఉపాధి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, కనీసం 6 గంటల సమయం పాటు పనిచేయడం ద్వారా రూ 250 పైబిలుకు వేతనాన్ని కూలీలు పొంద వచ్చునని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేయాలని అన్నారు. గరిష్ట వేతనం పొందేందుకుగాను ఎంతమేర పని చేయాలన్న అంశంపై సిబ్బంది వేతనదారులకు అవగాహన కల్పించాలని ఆదే శించారు. చేపట్టిన పనులు గ్రామానికి, ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా కూలీలు, సిబ్బంది సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పనుల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో పిడి వెంట ఏపీవో సత్యవతి, ఈసీ లెనిన్ బాబు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కలశాల విద్యార్థికి

రూ.6 లక్షల వార్షిక వేతనంతో కొలువు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఎమ్ఈసీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న జామి ప్రియాంక కు ప్రముఖ కంపెనీ అట్లాంటా ఐటి సొల్యూషన్స్ లో ఆరు లక్షల వార్షిక వేతనం తో కొలువు వచ్చినట్టు కలశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె శివ శంకర్ మాట్లాడుతూ కంపెనీ నిర్వహించిన ఐదు రౌండ్లలో విజయం సాధించి కొలువును సాధించిందని అన్నారు. ఈ విజయానికి కారణం కళాశాలలో విద్యార్థి సీటు పొందిన మొదటి రోజునుండి ఇస్తున్న క్రమ శిక్షణ తో కూడిన క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ మూల కారణం అన్నారు. ఈ రోజులలో ఐటి కొలువులు సాధించడం కష్టం అన్న విషయాన్ని కాకినాడ ఆదిత్య విద్య సంస్థలు సుసాధ్యం చేసిందన్నారు. జామి ప్రియాంకను ఆదిత్య విద్య సంస్థల అధినేత డా.ఎన్ శేషారెడ్డి, సెక్రటరీ డా.ఎన్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా బిఈవివిఎల్ నాయుడు అభినందించారు.

కళాశాల మైదానాన్ని కలెక్టర్, ఎస్పీలు పరిశీలన

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్, శ్రీకేష్ బి.లాట్కర్, ఎస్.పి, రాధిక పరిశీలించారు. ఈసందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్‌తో వారు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన పట్టణానికి వస్తున్న ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి భూ సర్వే రెండవ విడత ప్రారంభించిన అనంతరం ఈ మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, సింహాచలం, ఎంపిడివో, మధుసూధనరావు, సిఐ, రాము, ఎస్ఐ, సింహాచలం, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన : సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-టెక్కలి : పారిశుధ్యం పై ప్రజలలో అవగాహన కల్పించే విధంగా సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల పరిసరాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని దీని ద్వారా మనం రోగాల బారిన పడకుండా రక్షించుకోవచ్చని. ముఖ్యంగా ప్లాస్టిక్‌ని సంచులని మనమే వాడకుండా నివారించుకోవా లని, ఇలా చేయడం వలన ప్లాస్టిక్ నివారించవచ్చని ప్రతి ఒక్కరు క్లాత్ సంచుల్ని వాడాలని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆర్డీవో కార్యాలయం నుండి ఇందిరమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ బెండి గిరిబాబు, ఎంపీడీవో లక్ష్మీబాయి, మేజర్ పంచాయతీ సర్పంచ్ గుండెల సుజాత,ఎంఈఓ, ఈవో, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకాన్ని ప్రారంభించిన సూర శ్రీనివాసరావు

సొంత నిధులతో ప్రజలకు తాగునీరు అందజేత

విశాలాంధ్ర-అరసవల్లి/ఎచ్చెర్ల: మండలంలోని ఎచ్చెర్ల గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకును ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. సురక్షితమైన నీటిని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెప్పడంతో ట్యాంకర్‌ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. తాగునీరు అందక పోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడేవారని సూర శ్రీనివాసరావు చలువతో నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు కతజ్ఞతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము, దుంప రమణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ మృతి భాధాకరం

- నేడు కళామ్మతల్లి తన ముద్దు బిడ్డను కోల్పోయింది
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : సూపర్‌స్టార్ కృష్ణ మృతిబాదాకరమని, నేడు కళామ్మతల్లి తన ముద్దుబిడ్డను కోల్పోయిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం అచ్చెన్నాయుడు నిమ్మాడ గ్రామంలో తన క్యాంపు కార్యాయలంలో ఆయన మాట్లాడుతు క్రిష్ణ నటుడు, నిర్మాత, దర్శకుడు, నిర్మాణసంస్థ అధినేతగా తెలుగుసినిమా రంగానికి ఐదు దశాబ్దాల పాటు సినీ రంగంలో తనదైన ముద్రవేశారన్నారు. క్రిష్ణ మరణం తెలుగుసినీ రంగానికి తీరని లోటుయని, అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్ధిస్తున్నా నన్నారు. అలాగే అచ్చెన్నాయుడును తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు జిల్లా నలుమూలలు నుంచి పెద్ద ఎత్తున ఆయన కలుసుకొని తమ సమస్యలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, హిరమండలం జెడ్‌పీటీసీ బుచ్చిబాబు, టెక్కలి మండలం నౌపడ, మూలపేటగ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, నందిగాం మండలకు చెందిన నాయకులు, సంతబొమ్మాళి, పాలతలగాం, ఉద్దాండపాలేం, హరిమండలం, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు అచ్చెన్నాయదును మర్యాదపూర్వకంగా కలిసి తమ తమ గ్రామ సమస్యలు తెలియజేశారు.

భూసర్వేకు ప్రజలు సహకరించాలి : ఎంపీటీసీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వం జరిపిస్తున్న భూసర్వేను పంచాయతీ ప్రజలు అధికారులకు సహకరించాలని చీపుర్లపాడు ఎంపీటీసీ బొడ్డు అప్పన్న అన్నారు. ఆయన మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతింటి అప్పలస్వామితో కలిసి జగనన్న భూసర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో భూ యజమానులకు సమస్యలు ఉంటే పరిష్కరించుకోవ చ్చునని తెలిపారు. అనంతరం చీపుర్లపాడు ప్రభుత్వం పాఠశాలను సందర్శించి, పాఠశాలలో అమలవుతున్న మద్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెను ప్రకారం భోజనం వండి పెడుతున్నారా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నెయ్యిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ ఆర్కిటెక్ ఇంజనీరింగ్‌లో ప్రవీణ్‌కు బంగారు పతకం

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణానికి చెందిన శిష్టకరణ సంఘం ప్రధాన కార్యదర్శి, అంపలాం వసంతకుమార్ తనయుడు ప్రవీణ్‌కు ఆర్కిటెక్ ఇంజనీరింగ్ కోర్సులో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. నేషనల్ ఎడ్యుకేషన్ డే సంధర్భంగా గత ఆదివారం విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బంగారు పతకాన్ని, జ్ఞాపికను అందుకున్నారు. ప్రవీణ్ బంగారు పతకాన్ని సాధించినందుకు ఆయన తల్లితండ్రులు, వసంత్‌కుమార్, వనజ, శిష్టకరణ కార్పొరేషన్ డైరక్టర్, సదాశివుని కృష్ణ, సంఘం నాయకులు, సదాశివుని ప్రభాకరరావు, డి.వి.రఘు, సదాశివుని సింహాచలం, చౌదరి రవి తదితరులు అభినందిచారు.

పాలతగాంలో విద్యుత్ ఆధునీకరణ పనులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండలం పాలతగాం పంచాయతీలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న ఆధ్వర్యంలో విద్యుత్ ఆధునీకరణ పనులు నిర్వ హించారు. పంచాయతీ లో గత కొంతకాలంగా విద్యుత్ సమ స్యలు ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురికావలసిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, ఎంపిటిసి ప్రతినిది అట్టాడ అప్పలనాయుడులు, విద్యుత్ అధికారులు దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లారు. అలాగే ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. దీంతో విద్యుత్ ఏఈ మెట్ట శివకుమార్ స్పందించి, ఆధునీకరణ పనులు చేయించారు. ప్రజలు సమస్యపై స్పందించిన ఏఈకి, సర్పంచ్, ఎంపీటీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, యువ నాయకుడు నక్కిట్ల నరేష్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర, పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంకు విశేష స్పందన

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : ఎల్ఎన్‌పేట మండలంలో కరకవలస, ఆర్ఆర్ కోలానీ పంచాయితీల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం గడప గడప కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజమైన పాలన అందిస్తున్నారని, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందుకోని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జ్యోతిలక్ష్మి, సర్పంచులు గుజ్జల యోగేశ్వరరావు, రెడ్డి రామారావు, రాంప్రసాద్, రెడ్డి సీతారాం, లక్ష్మణరావు, కొల్ల రాము,యరబాటి గణపతిరావు, వలంటీర్లు మండల వైసీపీ నాయుకులు మండల అధికారులు ఎంపిడీఓ ఆర్.కాళిప్రసాద్, ఎపిఓ శ్రీదేవి, తదితర శాఖలు పాల్గొన్నారు.

రక్తదానంతోనే ప్రాణదానం

డాక్టర్ రాజేష్

విశాలాంధ్ర-కొత్తూరు: ఒక వ్యక్తి రక్త దానం చేస్తే మరో నలుగురు వ్యక్తులకు ప్రాణాన్ని పోసినట్లేనని సీతంపేట సామాజిక ఆసుపత్రి డాక్టర్ కొల్ల రాజేష్ అన్నారు. మంగళవారం మండలం మెట్టూరులో కొత్తూరు కు చెందిన భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్త ధన శిబిరం జరిగింది రాగోలు జెమ్స్ ఆసుపత్రి సహకారం తో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి నుంచి 350 మిల్లీ లీటర్ల రక్తాన్ని ఒక సారి సేకరించవచ్చు. అపోహలు వదిలి యువత రక్తం ఇవ్వడానికి ముందుకురావాలని అన్నారు. ట్రస్ట్ సభ్యులు బోదసింగి లోకేష్ మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి యేడాది లో మూడు సార్లు రక్తాన్ని ఇవ్వొచ్చు అని ఆయన అన్నారు. ఈ శిబిరంలో 70 మంది యువకులు రక్త దానం చేశారు. రక్త దానం చేసిన వారికి మెట్టూరు బిట్3 సర్పంచ్ కోయిలాపు శ్రీనివాస్ రావు, డాక్టర్ రాజేష్‌లు సంయుక్తంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

సమస్యలున్నా పరిష్కరించరా? : మాజీ ఎమ్మెల్యే కలమట

విశాలాంధ్ర-మెళియాపుట్టి: నియోజకవర్గం పరిధిలో గ్రామాలలో ప్రజలు వివిధ సమస్యలతో బాధపడుతూ ఎన్నిమార్లు ప్రజా ప్రతినిధులకు, పాలకులకు విన్నవించిన గాని పట్టించుకునే పరిస్థితిలు కనిపించడంలేదని ఇది నేడు పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మెళియాపుట్టి మండలం బాణపురం పంచాయతి పరిధిలోగల పదనాపురం గ్రామానికి వెళ్ళే గ్రావెల్ రోడ్డును మంగళవారం నేరుగా సందర్శించి పరిశీలించారు. రోడ్డు పనులు చేయించాలని స్థానిక ప్రజలు పలు దఫాలుగా ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యేలకు ఎన్ని మార్లు విన్నవించినప్పటికీ ఫలితంలేదని పదనాపురం గ్రామంలో ఉన్నటువంటి మంచీనీటి బోరు సైతం మరమతులకి గురైె సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ స్థానికులకు మంచీనీరు, మౌలిక సదుపాయాలు అందించడంలో ఎందుకు అలసత్వహిస్తున్నారో వారికే తెలియాలని తెలియజేస్తూ ప్రస్తుతం నియోజకవర్గంలోని అభివృద్ధి పరిస్థితి అలా ఉందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టిలో గ్రామాలకు సంబంధించిన సమస్యలను తీసుకునివెళ్లి వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేయడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం కొత్త మారేడుకోట, జాడుపల్లి, పెద్ద లక్ష్మీపురం తదితర గ్రామాల్లో సందర్శించి అనారోగ్యం పాలై, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ తోపాటు రాష్ట్ర బి.సి సెల్ ఉపాధ్యక్షులు పైల లచ్చుమయ్య, జాడుపల్లి ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, మండల ప్రధానకార్యదర్శి ఊర్లన వసంతరావు, బస్వా పరమేశ్వర రెడ్డి, వల్లబ, కోదండరావు, ఖగేష్, గంగాధర, క్రిష్ణ, శ్రీనివాసరావు, శాశిభుషణ్ లతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

చేపల మార్కెట్‌ను శుభ్రం చేయించిన సర్పంచ్ బురల్లి

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక చేపల మార్కెట్‌ను మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు మంగళవారం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. కొన్ని సంవత్సరాలుగా దుర్గంధాన్ని వెదజల్లుతూ స్థానికులకు, చేపల వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన ప్రాంతాన్ని ప్రొక్లెయినర్‌తో శుభ్రం చేయించి, 160లీటర్ల ఫినాయిల్‌తో శానిటేషన్ చేయించారు. అనంతరం చేపల వ్యర్థాలను వేయటానికి చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. సుమారు పది సంవత్సరాలకు పైగా చేపల వ్యర్థాలతో దర్శనమిచ్చిన ప్రాంతాన్ని శుభ్రం చేయించటం పట్ల స్థానికులు సర్పంచ్, శంకరరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్, గనగళ్ళ వేంకటశ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్వాడీలు పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో అందజేయాలి

సర్పంచ్ అప్పలస్వామిచిన్నమ్మడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వం కోట్లు ఖర్చుచేసి అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తుందని, దీనిని అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వం పంపిణీ చేసిన మెనూ ప్రకారం అందజేయాలని చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్నలు అన్నారు. వీరు మండలం చీపుర్లపాడు పంచాయతీ పరిధిలోగల అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న పౌష్టిక ఆహారాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసిన సరుకులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకుండా కొన్ని మాత్రం పంపిణీచేసి మమా అనిపిస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయని, ఇవే నిజమైతే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకులు అంగన్వాడీ టీచర్స్ ఇంటివద్ద ఉంచుకొని వారి అవసరాలకు వాడుకోగా మిగిలినవి వారికి నచ్చినవారికి ఇస్తున్నారని, నిజమైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందజేయటం లేదని తమ వద్ద సమాచారం ఉందని దీనిపై ధర్యాప్తు జరిపి నిజమైతే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వల్ల పిల్లలు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా గర్భిణీలకు. బాలింతలకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రతీ గర్భిణీ, బాలితలు అంగన్వాడీ కేంద్రంలో తమ పేర్లును నమోదు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారంను తీసుకోవాలని ఆయన సూచించారు.

ఈకార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర-హిరమండలం: చెత్త సంపద కేంద్రాలు ద్వారా వర్మీ కంపొస్టు ఎరువు లు తయారు చేసుకో వాలని ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ అన్నారు, మంగళవారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో ని చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీఓ శైలజ పరిశీలన చేశారు, గ్రామం లో ఉన్న ప్రతీ ఒక్క ఇంటి నుంచి తడి పొడి చెత్త లను సేకరించి వాటిని చెత్త సంపద కేంద్రాలు కు తరలించి కంపోస్ట్ ఎరువుల ను తయారు చెయ్యాలని ఆమె అన్నారు. అఎరువులను వినియోగిస్తే పంటలకు, భూమి సారవంత మయ్యేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు, దీనిపై రైతులు కు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీఓ తో పాటు పిఎసిఎస్ అధ్యక్షులు ఎవి సురేష్, పంచాయతీ కార్యాలయపర్యవేక్షకులు ఎ నర్సింగ్ రావు, పంచాయతీ సిబ్బంది, గొర్లె సురేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాలు రోడ్డుపైన ఉన్న గోతులను తప్పించుకునే క్రమంలో ఒకరినొకరు బలంగా ఢీకొన్నారు. ఇరువురికి గాయాలు అయ్యాయి. రహదారి ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కావడం తో ఆముదాలవలస 108 సిబ్బంది శ్రీకాకుళం తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు. శ్రీకాకుళంలో ఇంటర్వ్యూకు హాజరవుతున్న సీతంపేటకు చెందిన జైసూర్య, గుమ్మలక్ష్మీ పురంనకు చెందిన ఊలక లోహిత్ ఇద్దరు ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ గ్రామ వద్ద రహదారి ప్రమాదానికి గురైనారు. దీంతో క్షతగాత్రులను శ్రీకాకుళం లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు చికిత్స అందిస్తున్నట్లు 108 సిబ్బంది శేఖర్, చిన్నారావులు తెలిపారు.

ఇంటింటా తాగునీరే సర్కారు లక్ష్యం : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్రంలో ఇంటింటా త్రాగునీరు అందించడమే సర్కారు లక్ష్యంగా విశేషమైన సేవలు అందిస్తుందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలో గల ఎరుకులపేట, ఎరుకల కాలనీలలో 12 లక్షల నిధులతో చేపట్టే నాదు-నేడు పనులకు శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో 16.40 లక్షలతో జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి మంచి నీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ పైవిధంగా అన్నారు. మంచి నీటికి కొదవలేని రాష్ట్రంగా తీర్చిదిద్దే ఘనత సర్కారీకే దక్కిందన్నారు. ప్రజలు ఆశించే ఆశయాలను నెరవేర్చే దశగా పని చేసే ప్రభుత్వం తమదేనన్నారు. ఒకవైపు ప్రజా పథకాలను ప్రగతి బాటలో నడుపుతూ ప్రజా క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ముందుగా స్పీకర్ తమ్మినేని సీతారాంకు వేద పండితుల మంత్రోక్షణల మధ్య మేళ తాళాలతో, మంగళ హారతులతో, పూర్ణ కవచాన్ని చేతపట్టి మహిళలు స్వాగతం పలికారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పాలక వర్గం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాడిపంటల ప్రగతి కోసం మార్కెట్ కమిటీ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషా నాగేశ్వరరావు,జడ్పిటిసి సభ్యులు లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త గుడ్ల మోహనరావు,మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్ కుమార్, వైస్ చైర్మన్ జరజాపు వెంకటరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు, స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మి, మండల ఉపఎంపీపీలు వందన శ్రీదేవి,కాకర్ల చెల్లమాంబ, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనురాగ నిలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం మెట్టూరు బిట్ 3 ఆర్.ఆర్ గ్రామంలో హరీష్ అనురాగ నిలయాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ప్రారిమబించారు. సేవ్ గర్ల్ ఫౌండేషన్ ఓ మంచి నిర్ణయం తీసుకుంది. అనాదులకు ఆశ్రమం కల్పించడం, నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో ఎందరో అనాధ వృద్ధులు ఉన్నారు. ఆలాంటివారికి ఆశ్రయమిచ్చి అన్నం పెట్టాలంటే ఎంతో పెద్ద మనసుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చింతాడా సూర్యనారాయణ, ఎఎంసి చైర్మన్ గోగుల మాధవి ప్రాతినిధి గోగుల వర ప్రసాద్ నాయుడు, మెట్టూరు బిట్ -3 సర్పంచ్ కోయిలాపు శ్రీనివాస్ రావు, వైసీపీ జిల్లా కార్యదర్శి భూర్లే శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయానికి జెడ్పీటీసీ విరాళం

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం పలాసపురం గ్రామంలోగల ప్రసిద్ధ శ్రీదత్తాత్రేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన జెడ్పీటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు దంపతులు మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీకి లక్ష రూపాయల నగదు విరాళం అందజేశారు. ఇక్కడ వెలసిన శ్రీదత్తాత్రేయ పురాతన ఆలయం శిధిలావస్థకు చేరడంతో కొద్దికాలం క్రితం శిధిల ఆలయాన్ని తొలగించి అదే స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ విరాళంపట్ల పలాసపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర-రణస్థలం : శాఖ గ్రంథాలయం రణస్థలం లో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి రాజ్ కిషోర్ విచ్చేసి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని దీన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు వెళ్లేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో గ్రంథాలయంలో ఉంటాయని ప్రతి ఒక్కరు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమానికి మన్మధరావు బిసి కాలేజ్ వార్డెన్, పాఠకులు, విద్యార్థిని విద్యార్థులు,గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాలను జేసీ పరిశీలన

విశాలాంధ్ర-జలుమూరు : మండల కేంద్రంలోని జలుమూరు, చల్లవానిపేట, లింగాలవలస సచివాలయాలను జెసి నవీన్ మంగళవారం ఆకస్మిక పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యం అమ్ముకోవచ్చని, వారికి గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని సచివాలయ అధికారులను ఆదేశించారు. ఈయనతోపాటు తహశీల్దార్ బి. రామారావు, ఎంపీడీవో, డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సతీష్, శ్రీనివాస్, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని ఎంఈఓ తనిఖీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి లో ఉన్న భవిత కేంద్రాన్ని, ఎంఇఓ జలుమూరు చిన్నవాడు మంగళవారం తనిఖీ చేశారు. మానసిక వికలాంగులు కోసం అక్కడి ఉపాధ్యాయులు, సేవకులు నిర్వహించిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్ధిక సాయం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జీవనోపాధి కోసం ఒడిశా నుండి వచ్చిన నిరుపేద మహిళ స్థితిని తెలుసుకున్న హీలింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందించింది. కుటుంభ ఇబ్బందులతో రీనా నాయక్ ఇక్కడికి వచ్చి కూలీ పనులు చేసుకుంటుంది. ఒక చిన్నారి పోషణకు ఆమె పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన హీలింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 15 వేల రూపాయలను అందించారు. తోటి వారికి సహాయ పడాలనే ఉద్దేశ్యంతో తమ సంస్థ సభ్యులు పని చేస్తున్నామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సావాడ గణేష్, నీలాపు చిరంజీవి, మసూపత్రి నీలాద్రి, పనపాన కృష్ణ, నీలాపు ఏకంబర్, పిట్ట నరేంద్ర, గుజ్జు సాయి, పిట్ట భాస్కర్, మసూపత్రి గణేష్, నీలాపు మోహన్ తదితరులు తెలిపారు.

కింటా ధాన్యానికి రూ. 2,800 మద్దతు ధర ప్రకటించాలి : సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం కింటా ధాన్యానికి రూ. 2,800లు మద్దతు ధర ప్రకటించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు, మండల నాయకులు హెచ్.ఈశ్వరరావులు డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేరళలోని వామపక్ష ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ. 2,800లు మద్దతు ధర ప్రకటించిందని వారు తెలిపారు. స్వామినాథ కమిటీ సిఫార్సుల ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతుధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నించారు. కోటబొమ్మాళి మండలంలో అధికారులు లెక్కలు ప్రకారం 18000 ఎకరాల్లో ఉబాలు జరిగాయని, అందులో రెండు వేల ఎకరాలు పాక్షికంగాను, తొమ్మిది వందల ఎకరాలు సంపూర్ణంగాను పంట నష్టం జరిగినట్లుగా చెబుతున్నారని వారు పేర్కొన్నారు. వాస్తవంగా అంతకంటే ఎక్కువగా నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని లేకుంటే ఉద్యమాన్ని చేపటతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గొండు నీలన్న, సిహెచ్.వెంకటరావు, శ్రీనివాసరావు, ఆనందరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు దోహదపడతాయి

ఎంఈఓ ధనుంజయం మజ్జి

విశాలాంధ్ర-కవిటి : వ్యక్తిత్వ వికాసానికి, విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయం మజ్జి అన్నారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రమైన కవిటి శాఖ గ్రంథాలయంలో 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహరా ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రంధాలయాలు చెందిన వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు, ఒడియా హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు లింగరాజు ప్రసాద్ పట్నాయక్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-రేగిడి : సచివాలయాల్లో ప్రతి ఉద్యోగి అందుబాటులోఉండి సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోగన్నవరపు కాశీ విశ్వనాథరావు అన్నారు. మంగళవారం లింగాల వలస సచివాలయంలో మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయా శాఖల పనితీరుపైఅడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సచివాలయ ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేదిలేదని అన్నారు. పనితనం మెరుగుపరచుకొని సూచించారు. ఈయనతో పాటు సర్పంచ్ గురజాన అప్పలనాయుడు, సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.

బిర్సా ముండా ఆశయాలను కొనసాగించాలి

విశాలాంధ్ర-మందస : మన్యం విప్లవ వీరుడు బిర్సా ముండా ఆశయాలను ప్రతి ఒక్క గిరిజనులు కొనసాగించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.ధర్మారావు అన్నారు. మంగళవారం బవనపురంలో బిర్సా ముండా 147వ జయంతి వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూములను, కొండలను కార్పొరేటర్లకు, బాహులజాతి సంస్థలకు ధారాదత్తం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధమవుతుందని, దీనివలన గిరిజనులు తమ హక్కులను కోల్పోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం జీవో 52వ పత్రాలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో గురునాద్, యజాక భాస్కరరావు, మట్ట ధర్మారావులు పాల్గొన్నారు.

కళలకు నిలయం ఉద్దానం

విశాలాంధ్ర-కవిటి: కళలకు, కళాకారులకు నిలయం ఉద్దానం ప్రాంతం అని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావు అన్నారు. మంగళవారం బొరివంక గ్రామంలో ఉద్దాన యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన సంగీత కళాకారులచే సంగీత కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్తు రామారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కళాకారుల్లోనే ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా సంగీతం గురువర్యులు తిప్పన దనుంజయరెడ్డి,చాలపరాయి రవికుమార్, చలపరాయి వినోద్ కుమార్ లను ఘనంగా సత్కరించారు. అనంతరం పటాన రోహిత్యారెడ్డి (గాత్రం), కాతిల రుక్మిణీ రెడ్డి(గాత్రం), చలపరాయి చాణక్య(గాత్రం, మృదంగం), చలపరాయి అమృత(గాత్రం), నర్తు భార్గవ్(మృదంగం), జగన్ అచారి(మృదంగం), బి గౌతమ్(మృదంగం)లచే నిర్వహించిన చిన్నారుల సంగీత కచేరీ ఆహుతల్ని అలరించింది. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ బెందాలం విజయ్ కృష్ణ, ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్షుడు లొట్ల దీనబంధు, బెంధాలం మోహనరావు, ఇచ్ఛాపురం మండల ఇంజినీరింగ్ అధికారి భగీరథ దొలయి,బల్లెడ శ్యామ్,ఎం కేశవరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం మేజర్ పంచాయతీ బారువలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. 2వ రోజు మంగళ వారం గ్రంథాలయాధికారి ధర్మారావు ఆధ్వర్యంలో అనేక మంది విద్యార్థుల సమక్షంలో కవి సమ్మేళనం నిర్వహించి కవిత్వం పట్ల విద్యార్థులకు ఆసక్తిని, అవగాహనను కల్పించారు. అలాగే కొందరు విద్యార్థులు కూడా తమదైన శైలీలో కవితలు వినిపించారు. రిటైర్డ్ ఉపాధ్యా యుడు సాహుకారి ధనుంజయ్ కవితలతో అలరించారు. విద్యార్థులకు నిర్వహించిన కవిత పోటీల్లో జూనియర్స్ విభాగంలో ఎం.వల్లవి ప్రథమ స్థానంలోను, బి.రోజా ద్వితీయ స్థానంలో నిలి చారు. సీనియర్స్ విభాగంలో ఆర్.గాయత్రి, డి.పల్లవి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జి.పవిత్ర తృతీయ బహుమతి గెలుచుకుంది. అలాగే మరో వైపు పుస్తక ప్రదర్శన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు వెంకటరావు, శివ, తేజేశ్వరరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-జలుమూరు : పోలీస్‌స్టేషను ఎస్పీ జిఆర్ రాధిక మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులతో ముచ్చటించారు. మహిళా పోలీసుల జాబ్‌చార్ట్‌పై వారిని అడిగి తెలుసుకున్నారు. అనం తరం లోన్ యాప్స్‌పై మహిళా పోలీసులకు అవగా హన కల్పించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

తక్షణ సహాయం అందజేత

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : స్థానిక మేజరు పంచాయతీ పరిధిలో గల కరణాల వీధికి చెందిన సుడిగాం శేఖర్‌పట్నాయక్ ఇటీవల అనారోగ్యం మృతి చెందడంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావు తక్షణ సాయం కింద రూ. 10వేలను మంగళవారం అందజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎంపీటీసీ కమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వర రావు, పట్టణ అధ్యక్షుడు డబ్బీరు ప్రదీప్‌కుమార్, తదితరులు ఉన్నారు.

న్యాయమైన డిమాండ్లను ఎల్ఐసి పరిష్కరించాలి

విశాలంధ్ర-సోంపేట : భారతీయ బీమా దిగ్గజం, లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఏజెంట్లు, ఖాతాదారుల న్యాయమైన డిమాండ్లును పరిష్కరించాలంటూ బుధవారం సోంపేట ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పెద్దసంఖ్యలో ఏజెంట్లు హాజరై నినాదాలు చేశారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఖాతాదారులకు బోనస్‌ను మరింతగా పెంచాలని డిమాండ్ చేశారు. ఏజెంట్లును అణచివేసే చర్యలను సంస్థ వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఏజెంట్లు వసంతరావు, వాసుదేవరావు, రామ్మూర్తి, వెంకటరమణ, రంగనాథం, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను రూపుమాపాలని ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు అన్నారు. మంగళవారం చైల్డ్ లైన్ సెదోస్తీ వారోత్సవాల్లో భాగంగా రైడ్ ఫర్ సేఫ్ హుడ్ ర్యాలీ నిర్వహించి అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపి, బాలల దినోత్సవం గురించి వివరించారు. పిల్లలు లైంగిక వేధింపులు గురివ్వకుండా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చైల్డ్ లైన్ పలాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.శివాజీ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అనార్థలను నివారించి బాల్య వివాహాలను రూపుమాపాలన్నారు. బాలికల రక్షణ, సంరక్షణకు 1098 టోల్ ఫ్రీను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ టీమ్ సభ్యులు డి.రమ, డి.జగదీశ్వరి, కె.సునీత, సచివాలయం డబ్ల్యుపిఎస్ ఎం.యాస్మీన్ బేగం, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.చాణిక్యలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, పాఠశాల భోజనాలు పరిశీలన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పంచాయతీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భోజనాలు స్థానిక సర్పంచ్ ప్రతినిది, కలింగపట్నం అప్పారావు మంగళవారం పరిశీలించారు. అలాగే భోజనాలు నిర్వాహణపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అలాగే సంతబొమ్మాళి పంచాయతీ లో కల నగిరిపెంట గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు.

పుస్తకాలను వినియోగించుకోవాలి : ఎంఈఓ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: గ్రంథాలయాలలో ఉన్న వివిధరకాల విజ్ఞానం అందించే పుస్తకాలను వినియోగించుకోవాలని, ఎంఇఓ. జలుమూరు చిన్న వాడు అన్నారు. గ్రంథాలయాలు వారోత్సవాలు సందర్భంగా సంతబొమ్మాళి గ్రంథాలంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అలాగే నౌపడ గ్రంథాలయంలో ఉపాధ్యాయులు లోపింటి జయకృష్ణారెడ్డి, పుస్తకాలు ప్రాధాన్యత తెలియజేశారు. ఈకార్యక్రమంలో, ప్రధానోపాధ్యాయులు అంగూరు రామారావు, లైబ్రరీల అధికారులు కె.కృష్ణారావు, బి.రూపావతి, పాఠకులు పాల్గొన్నారు.

‘విశాఖ’పై విపక్షాలు విష ప్రచారమేల?

మాజీ ఉప ముఖ్యమంత్రి, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట :రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విశాఖపట్నాన్ని పాలనా రాజధానిగా చేస్తామని ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చెపితే విపక్షాలు విశాఖపై విషం చిమ్ముతున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, ధర్మాన కృష్ణదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజధానికి అవసరమైన అన్ని వనరులు, అర్హతలు విశాఖకు ఉన్నాయని, ఒకవైపు గిరిజన ప్రాంతం, మరోవైపు సముద్ర తీరం, మధ్యలో మైదాన ప్రాంతం ఇలా భౌగోళికంగా అన్ని సహజ వనరులున్నాయని తెలిపారు. విజ్ఞతలేని విపక్షాలు విశాఖ రాజధాని అంటే వ్యతిరేకిస్తున్నాయని, టిడిపి హాయాంలో అమరావతిలో చేసిన నిర్మాణాలు తాత్కాలికమని అన్నారు. తొలి విడతలో రూపుదిద్దుకుంటున్న ఇళ్ళన్నీ దాదాపుగా పూర్తయిన స్థితిలో ఉంటే పవన్‌కళ్యాణ్ వాటిపై రాజకీయాలు చేయటాన్ని లబ్ధిదారులే తిప్పికొట్టారని తెలిపారు. ఇప్పటికైనా విపక్షాలు విజ్ఞతతో వ్యవహరించి, వికేంద్రీకరణకు సహకరించాలని కృష్ణదాస్ కోరారు. ఈకార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, సుడా చైర్మన్ ప్రతినిధి, కెసిహెచ్‌బి.గుప్తా, జెడ్పీటిసి ప్రతినిధి, చింతు రామారావు, పోలాకి ఎంపిపి ప్రతినిధి, ముద్దాడ బైరాగినాయుడు, పొందరి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రతినిధి, రాజాపు అప్పన్న, పోలాకి వైసిపి ప్రతినిధి, కణితి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకమే ఓ గొప్ప స్నేహితుడు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.వి.త్రినాధరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. లైబ్రేరియన్ పూర్ణచంద్ర బెహరా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు పలువురి ప్రముఖ రచనలు, పుస్తకాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, లైబ్రేరియన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు చేతిలో ఓ పుస్తకం ఉంటే ఓ గొప్ప స్నేహితుడు దగ్గరే ఉన్నట్లని వివరించారు. పుస్తక పఠనం ద్వారా మేధస్సు పెరుగుతుందని, సామాజిక అంశాల పట్ల అవగాహన కల్గుతుందని తెలిపారు.

సజావుగా హెచ్ఆర్‌సీఓఐ పోటీ పరీక్షలు

విశాలాంధ్ర-పలాస : హెచ్ఆర్‌సిఓఐ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ చైర్మన్ రవీంద్రకుమార్, జాతీయ కార్యదర్శి బాడాన దేవభూషణ్ ఉత్తర్వులు మేరకు మంగళవారం పలాస ప్రజ్ఞ డిగ్రీ కాలేజీలో పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు ఉన్న జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఆర్‌సిఓఐ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు నారా వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌సిఓఐ జిల్లా ఉపాధ్యక్షులు జామి సంతోష్ నాని, జిల్లా ముఖ్య కార్యదర్శి క్రాంతి నాయక్, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి లవ కుమార్, గోపాల్‌శెట్టి, అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

విశాలాంధ్ర-కంచిలి : అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని కొక్కిలిపుట్టుగా పంచాయితీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయి లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైసీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, స్వచ్ఛభారత్ డైరెక్టర్ కృష్ణ రౌలో, నాయకులు లడ్డు కేశవ పాత్రో, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళిల్లు సంక్షేమ లోగిళ్ళు : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస : వై.ఎస్. జగన్మోహన రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలతో ఇల్లిల్లూ సంక్షేమ పథకాలతో తులతూగు తున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఈమేరకు మంగళవారం స్థానిక 15వ వార్డు పాతినవారి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ సంధర్భంగా స్పీకర్ మాట్లాడు తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ముఖ్యమంత్రి సంక్షేమ నిబద్ధత స్పష్టంగా తెలి యవస్తోందని అన్నారు. గ్రామ, వార్డు సచివా లయం, వార్డు వాలంటీర్ల వ్యవస్థతో అవినీతికి తావులేకుండా, అర్హతే ప్రామాణికంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. పేదలపట్ల నిబద్ధత కలిగిన ముఖ్య మంత్రి రాజనీతిజ్ఞత రాజకీయాలకు అతీతంగా అభినంచదగ్గది అని కొనియాడారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలాచూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనరు ఎం.రవిసుధాకర్, ఏఈ కె.అప్పల నాయుడు, టి.పి.ఎస్ హెచ్.వి సత్య నారాయణ, నాయకులు బి.రమేష్ కుమార్, పి.శ్రీనివాసరావు, ఏ.ఉమామేశ్వరరావు, బి. చిన్నంనాయుడు, కె.శ్యాం ప్రసాదరావు, ఎం.రమేష్, పి.చిన్నారావు, పి.కృష్ణవేణి, డి.శ్యామలరావు, బి.విశ్వేశ్వరరావు తదితర రెవెన్యూ, విద్యుత్, పోలీస్, మున్సిపల్, మెప్మా, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌కు సంబంధించి మినుము, పెసర, చోడి (రోగులు) విత్తనాలు సబ్సిడీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి వై.సురేష్ తెలిపారు. సబ్సిడీ మినహాయించగా 4 కిలోల మినుము (పీయూ 31 రకం) ప్యాకెట్ 320 రూపాయలు, 4 కిలోల పెసలు (ఐసీఎం 2-1-4 రకం) ప్యాకెట్ 325 రూపాయలు, 2 కిలోల చోడి (వీఎల్ 376) ప్యాకెట్ 67 రూపాయలకు లభిస్తుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నటశేఖర్ కృష్ణకు సంతాపం

విశాలాంధ్ర-పాలకొండ : తెలుగు చలన చిత్ర నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు, సూపర్ స్టార్ కృష్ణకు స్థానిక శాసన సభ్యురాలు విశ్వసరాయి కళావతి తమ సంతాపాన్ని ప్రకటించారు. మంగళవారం స్థానిక కొండవీధిలో సూపర్‌స్టార్ కృష్ణ మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణ పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. గిరిజనులు ఆరాధ్యదైవం అయిన మన్యంవీరు అల్లూరి సీతారామరాజు కథను చలన చిత్రంపై కళ్లకు కట్టినట్లు చూపించారని ఆయన్ను మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షులు లిల్లీ పుష్పనాథం, కార్యదర్శి కడగల వెంకటరమణ, వైసీపీ పట్టణాధ్యక్షులు వి. మన్మధరావు, కె, మధుబాబు, కౌన్సిలర్‌లు కె.లక్ష్మి, కె.మోహనరావు, ముద్దాడ చక్రవర్తి, బత్తిన మోహనరావు, సురేష్, కాంతారావు తదితరులు ఉన్నారు.

రవీంద్ర భారతిలో అంబరాన్నంటిన బాలల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : స్థానిక మండలవీధిలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాలలో బాలల దినోత్సవాలు ప్రధానోపాధ్యాయులు ఎన్. గంగారాం, డీన్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా చాచా నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి పిల్లలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రిగా పనిచేసిన నెహ్రూని భారతదేశమంతా గౌరవిస్తుందని, పిల్లలందరినీ ప్రేమించే స్వభావం కలిగుండేవారని, పిల్లలను జాతి సంపదగా భావించి అందరూ వారి భవితవ్యానికి కృషి చేయాలని నెహ్రూ తరచూ అనేవారని గుర్తుచేశారు. ఆయన పాలనాకాలంలో దేశంలో బాలల అభివృద్ధికి ఎంతో కృషి జరిగినందున ఆయన పుట్టిన రోజు నాడు మనదేశంలో బాలలంతా పండగ చేసుకుంటారని తెలిపారు. పాఠశాలలో రెండు రోజులు నిర్వహించిన పలు పోటీలలో గెలిచిన విద్యార్థులందరికీ బహుమతులు ప్రధానం చేసారు. అనంతరం మూడవతరగతి చదువుతున్న ట్వింకిల్ పట్నాయక్ ఇచ్చిన సందేశాత్మక వ్యాఖ్యానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజర్, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి, వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఉర్లాం పంచాయితీ పరిధిలో వున్న చింతువానిపేట, మతలబుపేట గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్, పోలాకి నర్సింహమూర్తి, ఎంపిపి, ఆరంగి మురళీధర్, వి.యన్.పురం సర్పంచ్, పుట్ట ఆదిలక్ష్మి, జెడ్పీటిసి ప్రతినిధి, చింతు రామారావు, వైసిపి ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటకొండ దుర్గమ్మను దర్శించుకున్న అయ్యప్పలు

విశాలాంధ్ర-భామిని : ఎతైన తువ్వ కొండ అందాల పై వెలసియున్న కొటకొండ దుర్గమ్మకు అయ్యప్ప దీక్ష స్వాములు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎతైన కొండపై ఉండటం సరైన రహదారి లేకపోవడంతో పూజలకు నోచుకోకపోవడం చాలా ఏళ్లుగా సాగుతుంది. ప్రస్తుతం అరకొర రహదారి సౌకర్యం కలగడంతో స్థానిక భక్తులు పలువురు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంకు కొటకొండ గ్రామంలో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, సర్పంచ్ బిడ్డిక మార్త దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తువ్వాకొండ అందాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

పల్లెల్లో పేదరిక నిర్మూలనకు ‘ఉపాధి’ మార్గం

- ఉపాధి హామీ పనిదినాల కల్పనలో అగ్రస్థానంలో జిల్లా
- జాతీయస్థాయి అవార్డు సాధనే లక్ష్యంగా అధికారులు సిబ్బంది కసరత్తు
- ఇప్పటివరకు వేతనాల రూపంలో రూ.248.312 కోట్లు చెల్లింపు
- మెటీరియల్ పనుల నిమిత్తం రూ 23.892 కోట్లు చెల్లింపులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో ఉపాధి హామీ పథకం అభివృద్ధి కాంతులను విరజిమ్ముతూ గ్రామాలను అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తుందనడంలో ఎటువంటి సందేహము లేదనే చెప్పుకోవచ్చు. వలసల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అసమానతలను రూపుమాపే ప్రధాన ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2005లో పార్లమెంటు లో చట్టం చేయడం ద్వారా అమలులోకి వచ్చింది. జిల్లాలో 2007వ సంవత్సరం నుండి ఈ పథకం అమలులోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల జీవన విధానంలో పెను మార్పులు తీసుకువచ్చింది. ఒకనాడు కనీస కూలీ కూడా లభించని వ్యవసాయ కార్మికులు నేడు ఉపాధి హామీ పనులు చేయడం ద్వారా తమ జీవితాలను సుస్థిరం చేసుకుంటున్నారు. మరోవైపు వ్యక్తిగత పండ్ల తోటల పెంపకం, బోరు బావులు, చేపల చెరువులు, తదితర వ్యక్తిగత ప్రయోజనాలను కల్పించే పనులను కూడా పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా ఎన్నో కుటుంబాలు వీటి ఫలితాలను అందిపుచ్చుకుంటూ విద్య వైద్యం, శాశ్వత నివాసం, ఆహార భద్రత పొందుతున్నారు. జిల్లాలో 5.09 లక్షల జాబ్ కార్డులు ఉండగా, వీటిలో 3.87 లక్షల యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 6.31 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు వేతనాల రూపంలో రూ. 248.312 కోట్లు చెల్లింపులు చేపట్టారు. మెటీరియల్ పేమెంట్ ల నిమిత్తం రూ. 23. 892 కోట్లు చెల్లింపులు ఇప్పటి వరకు జరిగాయి.

జిల్లాకు రెండు కోట్ల పని దినాల లక్ష్యం: జిల్లాలో ఇప్పటి వరకు 1. 40 కోట్ల మందికి ఉపాధి పనిదినాలను కల్పించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో సిక్కోలు నిలిచింది. వేతనదారులు జిల్లాలో ఎక్కువగా ఉండటంతో పాటు ప్రతి ఏటా ఉపాధి పథకం అమలులో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు జిల్లాకు రెండు కోట్ల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. వర్షాకాలంలో పనులు చేపట్టే అవకాశం లేనప్పటికీ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టి రాజు ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి అన్ని పంచాయతీల పరిధిలోను ఉపాధి హామీ ప్రత్యామ్నాయ పనులను చేపట్టడం ద్వారా వేతనదారులకు ఉపాధిని చూపించాలని మండల స్థాయి సిబ్బందికి ఆదేశించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఖండిత కందకాలు, మొక్కలు చుట్టూ వృత్తాకార కందకాలు, ఇంకుడు గుంతలు, ప్లాంటేషన్ పనులు, ఇతర భూగర్భ జలమట్టాన్ని పెంపొందించే పనులను చేపడుతున్నారు. పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటేందుకు గాను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సతశాతం మొక్కలు క్షేత్రస్థాయిలో ఉండే విధంగా ఖచ్చితమైన ఆదేశాలను సిబ్బందికి జారీ చేశారు. ప్రస్తుతం ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి.

సగటు వేతనం పెంపునకు చర్యలు: జిల్లాలో సగటు వేతనం పెంపొందించేందుకుగాను అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం జిల్లాలో రూ 175.55 సగటు వేతనంగా ఉంది. క్షేత్రస్థాయిలో కూలీలతో నిర్దేశించిన కొలతల మేర పనులు చేయించడం ద్వారా గరిష్ట వేతనం కూలీలు పొందేలా చేసి సగటు వేతనాన్ని రూ 250 పెంచేందుకుగాను ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు దశలవారీగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. తద్వారా వీరిలో సాంకేతిక నైపుణ్యతను మరింత పెంపొందింప చేయడం ద్వారా వేతనదారులకు అవగాహనను కల్పించి గరిష్ట వేతనం పెరిగేలా చేయడమే ఈ శిక్షణల ప్రధాన ఉద్దేశం. పిడి జీవి చిట్టి రాజు క్షేత్రస్థాయిలో నిరంతరం జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేయడం ద్వారా పనులు జరిగాలా చేయడంతో పాటు సగటు వేతనం గరిష్ట స్థాయిలో పెరిగే విధంగా నిరంతరం కృషి చేస్తున్నారు.

లేబర్ బడ్జెట్ రూపకల్పన:. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులకు సంబంధించి గ్రామస్థాయిలో వేతనదారులకు ఉపాధిని కల్పించడంతోపాటు గ్రామాల్లో శాశ్వత మరియు సుస్థిర ఆస్తుల కల్పనకు అవసరమైన పనులను గుర్తించేందుకుగాను ప్లానింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఇందులో ఆయా పంచాయతీలు మరియు గ్రామాల పరిధిలో ఉండే వేతనదారులను పరిగణలోకి తీసుకుని అందుకు అవసరమైన పనులతో అంచనాలు రూపొందించి ఉపాధి హామీ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా చేయడమే లేబర్ బడ్జెట్ తయారీ ముఖ్య ఉద్దేశం. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు గాను జిల్లా అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రస్తుతం తలమునకలై ఉన్నారు.

వలసల నివారణ ప్రధాన ధ్యేయం : ద్వామా పీడీ జీవీ చిట్టి రాజు

జిల్లాలో వలసల నివారణ ప్రధాన ధ్యేయంగా ఉపాధి పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టి రాజు తెలియజేశారు. జాబ్ కార్డు ఉండి పని కోరిన వారందరికీ ఉపాధిని చూపించడమే తమ ప్రథమ లక్ష్యం అని ఆయన వివరించారు. ఎందుకు గాను వర్షాకాలంలోనూ మండలాల్లో అవసరమైన పనులు చేపట్టేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన ఆదేశాలను జారీ చేశామని అన్నారు. రానున్న ఐదు నెలల కాలంలో 60 లక్షల పనిధినాలు కూలీలకు కల్పించడంతోపాటు గరిష్ట వేతనం రూ 250 వచ్చేవిధంగా పక్క ప్రణాళికలు రూపొందించామని, వీటిని అమలు చేస్తామన్నారు.